
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 18 ఫిబ్రవరి 2024





సభకు హాజరైన జనసందోహం

గెలుపు మనదే..

ఇక ఫ్యాన్ రెక్కలు ముక్కలే



సైకిల్ చిహ్నం చూపిస్తున్న ఓ పెద్దాయన



మహిళల ఉత్సాహం

వైసీపీ నేతలకు చురకలు

- వేమూరులో మంత్రి అక్కడ చెత్త, సంతనూతలపాడులో ఏమవుతాడు. అక్కడ కూడా చెత్తే కదా. ఆ చెత్తను ఎక్కడకు పంపాలి డంపింగ్ యార్డుకు కదా. ఇసుక అక్రమాలలో రూ.100 కోట్లుపైగా సంపాదించాడు.
- చీరాలలో 2019లో మనం గెలిపించిన దుర్మార్గుడు కష్టాల్లో వెళ్లిపోయాడు. మరలా గెలిపిస్తే మన దగ్గరకు వస్తామంటున్నారు. మనం నమ్ముతామా.
- రేపల్లెలో మోపిదేవి ఇక శాశ్వతం గా పేకాట ఆడుకోవడమే.
- బాపట్లలో కోనది కోట్లు కొల్లగొట్టిన ఘనత. కోన రఘుపతి కమర్షియల్ రఘుపతిగా మారాడు. ఇంటి పర్మిషన్, రియల్ ఎస్టేట్ వెంచర్ వేయాలన్నా డబ్బు చెల్లించాల్సిందే.
- బాపట్ల ఎంపీకి చెరుకుతోటలు కాల్చడం, కబ్జాలు, బెదిరింపులు, మట్టి, గ్రావెల్ దోపిడీ మాత్రమే తెలుసు.

ప్రభుత్వ అవాంతరాలు ఎదిరించి.. పోలీసుల ఆంక్షలు అధిగమించి.. జనసంద్రం ఇంకొల్లుకు తరలివచ్చింది. భారీగా జనం తరలివచ్చిన బహిరంగ సభలో మీ కోసం వచ్చా.. మీ వెంటే ఉంటా అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు అభయం ఇచ్చారు. సీఎం జగన్ నుంచి వైసీపీ నేతల అక్రమాలపై సెటైర్లు వేస్తూ, జగన్‌రెడ్డి వైఫల్యాలను ఎండగడుతూ, అక్రమాలను మననం చేస్తూ చంద్రబాబు చేసిన ప్రసంగం సభికులను ఉర్రూతలూగించింది. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని 7 నియోజక వర్గాల్లోని అక్రమాలను ఎండగడుతూ, నేతలకు చురకలు అంటిస్తూ, అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే హామీలను వివరించారు. ఎన్నికలకు పార్టీ శ్రేణు లు సిద్ధంగా ఉండాలని పిలుపిచ్చారు.



పార్టీ జెండా ఊపుతున్న అధినేత చంద్రబాబు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



ప్రసంగిస్తున్న వేగేశన నరేంద్రవర్మ



మద్యం బ్రాండ్‌లను చూపిస్తున్న యువత



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ శ్రీరాం మాల్యాద్రి

అందరి బాధ్యత నాదే..

అధికారంలోకి వచ్చాక అందరి బాధ్యత తీసుకుంటా. నేతన్నల కోసం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తా. చేనేత కార్మికులకు కేటగిరీని బట్టి 200 నుంచి 500 వరకు ఉచిత విద్యుత్ అందిస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికి రెండు సెంట్లులో ఇళ్లు కట్టిస్తాం. ఇంకొల్లుతో పాటు ముస్లిం సోదరులున్న చోట ఆటోనగర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం. గండ్లకమ్మ మరమ్మతులు చేపడతాం. పర్యాటకంగా బీచ్‌లను అభివృద్ధి చేస్తాం. గ్రానైట్ పరిశ్రమకు పూర్వవైభవం తెస్తాం. గుం టూ రు ఛానల్ పొడిగింపు చేస్తాం. సాకి, ఆలేరు, రొంపేరుల పనులుతో పాటు, గోదావరి జలాలు సాగర్ రైట్ కెనాల్‌కు తరలింపు, కొమ్మమూరు కాలువ పనులు చేపడతాం. విదేశీ విద్య, పండుగ కానుకలు, అన్నా క్యాంటీన్‌లు కొనసాగుతాయి.

- రాష్ట్రంలో టీడీపీ, జనసేన సునామీ
- పర్చూరు రాజకీయం రాష్ట్రానికే కేస్‌స్టడీ
- రా.. కదలి రా సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

చీరాల, ఫిబ్రవరి 17: గెలుపు మనదే.. అనుమానం లేదు.. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి.. మీ కోసం పనిచేస్తా.. రాజకీయాన్ని కలుషితం చేసిందెవరో తెలుసుగా.. అతడ్ని సాగనంపుదాం. ఇక మిగిలింది 52 రోజులే. కౌంట్ డౌన్ స్టార్టయ్యింది. ఇక ఫ్యాన్ రెక్కలు ముక్కలు ముక్కలే.. తెరలు కట్టుకుని తిరగడం కాదు.. పర్చూరు పౌరుషం చూడు జగన్‌రెడ్డి.. సభకు వచ్చిన జనసంద్రాన్ని టీవీలలో చూడు. చూస్తే రాత్రికి నిద్ర కూడా రాదు. నీ డబ్బు సంచులు, అక్రమ కేసులతో ఎవరినీ ఆపలేవు.. అని బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులోని తారకరామ విజయభేరి ప్రాంగణంలో జరిగిన రా.. కదలి రా సభలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం టీడీపీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. సీఎం జగన్ పెట్టే ప్రతీ స్కీం వెనుక ఓ స్కాం ఉంటుంది. ల్యాండ్, శాండ్, మైన్, వైన్ ఇలా ప్రతి అంశంలో వైసీపీ ప్రభుత్వానిది అక్రమార్జనే. సహజ వనరులను దోపిడీ చేసి సీఎం జగన్ తన ఆస్తులు పెంచుకున్నాడు. రాష్ట్ర ప్రజలను బాధితులను, పేదలను చేసి దగా మెత్తారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరు సైకో బాధితులే. అందుకే నేను ఉన్నాను.. పవన్‌కళ్యాణ్ ఉన్నారు.. ప్రజలందరూ కూడా ఉన్నారని చంద్రబాబు వివరించారు. పర్చూరులో పాలకపార్టీ చేసిన అక్రమాలు రాష్ట్రానికి కేస్ స్టడీ. విధ్వంసం, దొంగ ఓట్లు, అక్రమ కేసులు ఇలాంటివి ఎన్నో చేశారు. ఓట్లు తొలగించడానికి దాదాపు 14,000 ఫాం 7లు దరఖాస్తు చేశారు. తాడేపల్లిలో పెద్ద సైకో ఉంటే ఇక్కడ చిన్న సైకో ఉన్నారు. 2019లో చీరాలలో చీకొట్టించుకున్న వ్యక్తి ఇక్కడ దొంగ ఓట్లు చేర్పడం, గ్రానైట్ వ్యాపారులపై అక్రమ కేసులు బనాయించాడు. ఆ బకారుసు రుడ్ని కాదని మరొకతన్ని తెచ్చారు. ఎవరు వచ్చినా ఇక్కడ సాంబశివరావు గెలుపును ఆపలేరు. తనిఖీల పేరుతో అధికారుల వాహనాల్లోనే కారం, కర్రలు తీసుకువచ్చారు. వాటిపై సాంబశివరావు పోరాడారు. గ్రానైట్ కేసులపై అద్దంకిలో ఎమ్మెల్యే రవి కుమార్ సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడారు. కొండేపి ఎమ్మెల్యే బలావీరాంజనేయ స్వామి సంతనూతలపాడు ఎమ్మెల్యేపై అసెంబ్లీలో ధీటుగా వ్యవహరించారు. ప్రతి నాయకుడు ఇలానే పోరాడాలి.



చంద్రబాబును సన్మానిస్తున్న ముస్లిం,ఇతర నాయకులు

చంద్రబాబుది పాలనా దక్షత

గతంలో కొమ్మమూరు, సాగర్ కాలువలకు తక్కువ నీరున్నప్పుడు కూడా రైతులు ఎక్కువ పంటలు పండించారని, అది చంద్రబాబు పరిపాలన దక్షతకు నిదర్శనమని ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఇప్పుడు వాటర్ నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. రా.. కదలి రా సభ జరగకుండా అనేక కుట్రలు చేశారని వాటన్నింటిని ఎదుర్కొన్నామన్నారు. తాడికొండ, అద్దంకి, రేపల్లె ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయస్వామి, చీరాల, బాపట్ల, సంతనూతలపాడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఎం.ఎం కొండయ్య, వేగేశన నరేంద్రవర్మ, బి.ఎన్ విజయ్‌కుమార్, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎంపీ శ్రీరాం మాల్యాద్రి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్, విజయ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ వైసీపీ నియంత పాలనకు చరమ గీతం పాడదామన్నారు. జగన్‌కు టీడీపీ, జనసేన శ్రేణులు కుర్చీ మడత పెట్టాలని పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డిని సాగనంపేందుకు సైకిల్, గ్లాస్ గుర్తులపై బటన్ నొక్కాలన్నారు.

రా కదిలిరా.. జనసంద్రం

ప్రభుత్వం గడచిన మూడు రోజులుగా ఏదో ఒక విధంగా సభకు అవాంతరాలు సృష్టించే ప్రయత్నం చేయగా.. వాటిని ఛేదించి టీడీపీ నేతలు సభను విజయవంతం చేశారు. దాదాపు లక్షమంది సభకు హాజరుకాగా మరో 50 వేల మంది ట్రాఫిక్ ఇక్కట్ల వల్ల సభాస్థలికి చేరుకోలేకపోయారు. శనివారం కూడా పాలకపార్టీ పోలీసులను స్వల్ప సంఖ్యలోనే భద్రత కోసం నియమించడంతో పాటు ట్రాఫిక్‌ను గాలికొదిలేసింది. టీడీపీ వలంటీర్లే పెద్ద సంఖ్యలో సేవలందించడంతో సభ సజావుగా జరిగింది. సభ జరిగే నాలుగు వైపుల ఉన్న రహదారుల్లో దాదాపు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. వాటిని నియంత్రించే వారే కరువయ్యారు. ఇంకొల్లులో జరిగిన తెలుగుదేశం, జనసేన పార్టీల రా.. కదలి రా సభ జనసంద్రాన్ని తలపించింది. నిర్ణీత సమయం 2 గంటల కు సభ ప్రారంభించారు. నాయకు లు వైసీపీ అకృత్యాలను ఎండగడు తూ ప్రసంగాలు చేశారు. గం.3.40 కు వేదిక పైకి చంద్రబాబు వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇటీవల మైనింగ్ అధికారుల చర్యలకు బాధితులైన గ్రానైట్ వ్యాపారులను ఎమ్మెల్యే ఏలూరి చంద్రబాబుకు పరిచయం చేశారు. అనంతరం గంట సేపు చం ద్రబాబు ప్రసంగం చేశారు. టీడీపీ, జనసేన జెండాలను ఊపుతూ సైకో పోవాలి, సైకిల్ రావాలి అన్న పాట డీజేలతో సభ ఉర్రూతలూగింది.



చంద్రబాబుతో ఎమ్మెల్యేలు అనగాని, ఏలూరు సమాలోచన



చంద్రబాబుతో దగ్గుమళ్ల ప్రసాదరావు అభివాదం



సభా వేదికపై ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తూ...



వేదికపై బాపట్ల జిల్లా టీడీపీ, జనసేన నాయకులు

దిక్సూచి
DIKSUCHI

ఎంబీఏ



ఐఐటీ జోధ్‌పూర్

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీజే)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఎస్ఎంఈ)- 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ని రెండు మోడ్‌లలో నిర్వహిస్తున్నారు. మొదటి మోడ్ ప్రకారం- ప్రోగ్రామ్ మొదటి ఏడాది కోర్సుని ఐఐటీజేలోను, రెండో ఏడాది కోర్సును యూఎస్ఏలోని ఎస్‌యూఎన్‌వై అల్బేనీలో చదువుకోవచ్చు. అల్బేనీ విద్యార్థులకు 5000 డాలర్ల స్కాలర్‌షిప్, మూడేళ్ల ప్రాక్టికల్ ట్రెయినింగ్‌కు అనుమతిస్తూ ఎఫ్-1 స్టూడెంట్ వీసా, అల్బేనీ అసిస్టెంట్‌షిప్ అందిస్తారు. ఈ మోడ్‌లో చదివిన వారికి ఐఐటీజే నుంచి 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' డిగ్రీ, ఎస్‌యూఎన్‌వై అల్బేనీ నుంచి 'ఎంఎస్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్' డిగ్రీ లభిస్తాయి. రెండో మోడ్ ప్రకారం ప్రోగ్రామ్ రెండేళ్లూ ఐఐటీజేలోనే చదువుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ 2023/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఎంటెక్ అభ్యర్థులకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ అభ్యర్థులకు జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులందరికీ దరఖాస్తు నాటికి ఐటీ/బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసెస్/ఇన్సూరెన్స్/సైబర్‌సెక్యూరిటీ తదితర విభాగాల్లో కనీసం రెండేళ్ల ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి. ఇంటర్న్‌షిప్‌లు; కోచింగ్ సెంటర్లు, స్మాల్ స్కేల్ బిజినెస్ సంస్థలు, రిటైల్ స్టోర్స్, కిరాణా స్టోర్స్, ఎన్‌జీఓ సంస్థలు, పెట్రోల్ పంప్ సంస్థలు, గ్యాస్ స్టేషన్‌లలో పనిచేయడాన్ని అనుభవం కింద పరిగణించరు.

ఎంపిక: క్యాట్ 2023/గేట్/జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్/అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ స్కోర్, అనుభవం, జెండర్ డైవర్సిటీ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** iitj.ac.in

ఐఐటీ మండీ

మండీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎస్ఓఎం)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: రెండు కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. మొదటి కేటగిరీ అడ్మిషన్స్‌కు సీఎఫ్‌టీఐ గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 65 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 60 శాతం మార్కులు ఉండాలి. వీరికి క్యాట్ వ్యాలిడ్ స్కోర్ అవసరం లేదు. రెండో కేటగిరీ అడ్మిషన్స్‌కు ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. రెండు కేటగిరీలకు చెందిన అభ్యర్థులూ ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారికి మొదటి కేటగిరీ కింద ప్రవేశాలు కల్పిస్తారు. ఎన్ఆర్ఐ, విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ 2023 స్కోర్ ఉండాలి.

ఎంపిక: మొదటి కేటగిరీ అభ్యర్థులను అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా; రెండో కేటగిరీ అభ్యర్థులను క్యాట్ 2023 స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. తరవాత సెలెక్షన్ కమిటీ నిర్ణయం ప్రకారం ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** iitmandi.ac.in

ఆర్మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాషన్ అండ్ డిజైన్

ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ(ఏడబ్ల్యూఈఎస్) బెంగళూరులో నిర్వహిస్తున్న ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ అండ్ డిజైన్(ఏఐఎఫ్‌డీ)- బీఎస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫ్యాషన్ అండ్ అప్పారెల్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ అండ్ డెకరేషన్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌ని ఆర్మీ విభాగాలకు చెందిన ఉద్యోగులు/విశ్రాంత ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేకించారు. రిటెన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల్లో ఒకరికి ఆర్మీ ఉద్యోగిగా కనీసం పదేళ్ల సర్వీస్ ఉండాలి.

రిటెన్ అడ్మిషన్ టెస్ట్: దీనిని మొత్తం 100 మార్కులకు నిర్వహిస్తారు. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ టెస్ట్, జనరల్ అవేర్‌నెస్ టెస్ట్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంపిటెన్సీ అండ్ కాంప్రహెన్షన్ టెస్ట్ ఉంటాయి. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** aifd.edu.in

ఐఐపీలో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్



చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ (సీపీఈ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సుకు ఏషియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ (ఏపీఎఫ్) సహకారం అందిస్తోంది. ఇందులో ప్రధానాంశం 'ప్యాకేజింగ్'. ఇంజనీర్లకు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌ను జూలై నుంచి అక్టోబరు వరకు, రెండో సెమిస్టర్‌ను నవంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు, మూడో సెమిస్టర్‌ను వచ్చే ఏడాది మార్చి నుంచి జూన్ వరకు నిర్వహిస్తారు. సాయంత్రం వేళల్లో, వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో కాంటాక్ట్ క్లాసెస్ ఉంటాయి. ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం ల్యాబొరేటరీ డెమాన్‌స్ట్రేషన్స్ నిర్వహిస్తారు. వీటి కోసం అభ్యర్థులు చెన్నై సెంటర్‌లో హాజరు కావాల్సి ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ విజిట్స్, ఇండస్ట్రియల్ విజిట్స్, కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో నాలుగు నెలల పాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రతి సెమిస్టర్ చివరలో ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం, మొత్తమ్మీద 50 శాతం మార్కులు ఉంటేనే సర్టిఫికెట్ ఇస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి ఆటోమొబైల్ సంస్థలు, టెక్స్‌టైల్ హబ్‌లు, ఫైర్‌వర్క్స్ ఇండస్ట్రీలు, ఎఫ్ఎంసీజీ మాన్యుఫాక్చరింగ్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రింటింగ్ టెక్నాలజీ/ప్యాకేజింగ్ టెక్నాలజీ/పాలిమర్ ఇంజనీరింగ్/పాలిమర్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/బయో టెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ టెక్నాలజీ/పేపర్ ఇంజనీరింగ్/పేపర్ టెక్నాలజీ/ప్లాస్టిక్స్ టెక్నాలజీ/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఇతర విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ప్యాకేజింగ్‌పై ఆసక్తి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం
- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.83,190
- **అడ్మిషన్ సమయంలో చెల్లించాల్సిన సెమిస్టర్ ఫీజు:** రూ.35,990
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500+18% జీఎస్టీ
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కాంటాక్ట్ క్లాసెస్ సెంటర్లు:** ముంబై, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్
- **వెబ్‌సైట్:** www.iip-in.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8yMEdJCలో చదవండి.

ఏఆర్‌వో విశాఖపట్నం పరిధిలో అగ్నివీరులు



విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్... అగ్నిపథ్ పథకం కింద 2024-25 సంవత్సరం నియామకాలకు సంబంధించి అగ్నివీరుల ఎంపిక కోసం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ నియామకాలకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, కాకినాడ జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులు.

కేటగిరీలు:
1. అగ్నివీర్ జనరల్ డ్యూటీ(ఆల్ ఆర్మ్స్)
2. అగ్నివీర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
3. అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
4. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(టెన్త్ పాస్)(ఆల్ ఆర్మ్స్)
5. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(8వ తరగతి ఉత్తీర్ణత) (ఆల్ ఆర్మ్స్)

వయోపరిమితి: 17 1/2 - 21 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థి 2003 అక్టోబరు 1 నుంచి 2007 ఏప్రిల్ మధ్య జన్మించి ఉండాలి.

అర్హత: పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి/మెట్రిక్యులేషన్, 10+2/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ లేదా ఆర్ట్స్, కామర్స్ సైన్స్), సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎత్తు(సెం.మీ.లలో): అగ్నివీర్ జీడీ/ట్రేడ్స్‌మన్-166, అగ్నివీర్ టెక్నికల్-165, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్-162.

ఛాతీ కొలత: గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ విస్తరణతో 77 సెం.మీ. ఉండాలి


పరీక్ష ఫీజు: రూ.250

రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 22

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: ఏప్రిల్ 22

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

శివరాత్రికి సిద్ధం



గోపీచంద్ హీరోగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమ' మహా శివరాత్రి సందర్భంగా మార్చి 8న విడుదల కానుంది. 'మరో ఇరవై రోజుల్లో..' అని పేర్కొంటూ శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఫైటింగ్‌కు సిద్ధం అన్నట్లు పోలీస్ యూనిఫామ్‌లో గోపీచంద్ కవ్విస్తున్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో కె.కె.రాదామోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రియా భవానీశంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించారు.



మున్నార్‌లో ముగించారు

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం మున్నార్‌లో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తాజా షెడ్యూల్‌లో చిత్రబృందం పాల్గొనగా కీలకఘట్టాలను తెరకెక్కించారు. టాకీపార్ట్‌తో పాటు నితిన్, ఫైటర్స్‌పై భారీ యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరించారు. త్వరలోనే తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించనున్నట్లు యూనిట్ తెలిపింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నితిన్ సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

అమరన్‌గా శివ కార్తికేయన్



తమిళ హీరో శివ కార్తికేయన్ హీరోగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న చిత్రానికి 'అమరన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. శనివారం శివ కార్తికేయన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, టీజర్‌ను విడుదల చేసింది. ఆర్మీ మేజర్ ముకుందవరదరాజన్ జీవితం ఆధారంగా రాహుల్ సింగ్, శివ్ అరూర్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్ లెస్' సిరీస్‌లోని ఓ అధ్యాయం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశలో ఉంది. వేసవిలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి

గ్రామీణ ప్రేమకథ



ప్రేమకు అర్థం చెబుతూ రూపొందిన 'రాధా మాధవం' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించారు. దాసరి ఇస్సాకు దర్శకత్వంలో గోనాల్ వెంకటేశ్ ఈ సినిమాను నిర్మించారు. 'మా సినిమా సెన్సార్ పూర్తయింది. గ్రామీణ నేపథ్యంలో నిర్మించిన చక్కని సందేశాత్మక చిత్రమని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. ఇటీవల విడుదల చేసిన టైటిల్ సాంగ్, టీజర్, ట్రైలర్‌లకు మంచి స్పందన వచ్చింది. సినిమాపై నమ్మకం పెరిగింది. మార్చి ఒకటిన ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని చెప్పారు నిర్మాత. వసంత్ వెంకట్ బాలా కథ, మాటలు, పాటలు అందించిన ఈ చిత్రానికి సతీశ్ లైన్ ప్రొడ్యూసర్

ఒకే పాత్ర.. సామాజిక సందేశం



ఒకే పాత్రతో సామాజిక సందేశంతో రూపొందిన చిత్రం 'నేటి భారతం'. భరత్ పారేపల్లి దర్శకత్వంలో డాక్టర్ యర్రా శ్రీధర్ రాజు నటిస్తూ ఈ సినిమాను నిర్మించారు. త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ విడుదల చేశారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత సాంబేష్ మాట్లాడుతూ 'మంచి సినిమాలు చేయాలని శ్రీధర్ రాజు పరిశ్రమకు వచ్చారు. మొదటి 'మేరా భారత్ మహాన్' సినిమా తీశారు. ఇప్పుడు ఒకే పాత్రతో 'నేటి భారతం' తీశారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని ఈ సినిమా ద్వారా చూపించాం' అని చెప్పారు. కరోనా తర్వాత వచ్చిన ఆర్థిక, సామాజిక స్థితిగతులపై ఈ సినిమా ఉంటుందని నిర్మాత, నటుడు శ్రీధర్ రాజు చెప్పారు. ఇందులో తను జర్నలిస్ట్ పాత్రను పోషించినట్లు తెలిపారు. జర్నలిస్టు అంకిత భావం, తెగింపు ఇందులో చూపించామని చెప్పారు.

టీనేజ్ లవ్ స్టోరీ



ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ జంటగా రూపుదిద్దుకున్న చిత్రం 'మధురం2. రాజేశ్ చికిలే దర్శకత్వంలో యం. బంగార్రాజు ఈ సినిమా నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. దర్శకుడు చిత్రం గురించి వివరిస్తూ '1990 నేపథ్యంలో జరిగే టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. అప్పటి స్కూల్ వాతావరణం, ఆటలు, అల్లర్లు, ఎలా ఉండేవో చూపిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత బంగార్రాజు మాట్లాడుతూ 'కొత్తదనం ఉన్న కథల్ని ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. మా సినిమా కూడా కొత్తగా, నేటి తరానికి కనెక్ట్ అయ్యే విధంగా ఉంటుంది. హైదరాబాద్, పాలకొల్లు, ఆచంట, సిద్ధాంతం, రావులపాలెం , కోనసీమ ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. సమ్మర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు.

అరుదైన వ్యాధితో 'దంగల్' నటి మరణం





ఆమిర్ ఖాన్ నటించిన 'దంగల్'(2016)లో బబిత పాత్రలో నటించిన బాలనటి సుహానీ భట్నాగర్ అరుదైన వ్యాదితో శుక్రవారం కన్ను మూసింది. ఆమె వయసు 19 ఏళ్లు. సుహానీ డెర్మటోమయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధ పడుతోంది. స్టెరాయిడ్స్ ఇవ్వడమే దీనికి చికిత్స కండరాలను బలహీన పరచడం, శరీరంపై రాష్ రావడం ఈ వ్యాది లక్షణాలు. ఈ వ్యాది తగ్గడానికి చాలా సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. వారి సూచన మేరకు స్టెరాయిడ్స్ తీసుకున్నా, ఆమె లేత శరీరం దానికి తట్టుకోలేక పోయింది. దానికి తోడు ఇన్‌ఫెక్షన్ వచ్చి , లంగ్స్‌లోకి నీరు చేరడంతో సుహానికి శ్వాస తీసుకోవడం కష్టమైంది. అలా బాద పడుతూనే చివరకు శుక్రవారం సాయంత్రం ఆమె కన్ను మూసిందని సుహానీ తండ్రి పునీత్ సజల నయనాలతో చెప్పారు. 'దంగల్'లో నటించిన తర్వాత కొన్ని యాడ్ ఫిల్మ్‌లో సుహాని నటించింది. 2019లో ఆమె నటనకు దూరం జరిగి చదువు మీద దృష్టి పెట్టింది. ప్రస్తుతం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ చదువుతోంది. సోషల్ మీడియాకు దూరంగా ఉండే సుహాని చదువు పూర్తయ్యాక మళ్లీ సినిమాల్లో నటించాలనుకుందనీ, అంతలోనే ఇలా జరగడం చూసి తట్టుకోలేక పోతున్నామని ఆమె తల్లి పూజ చెబుతూ ఎమోషనల్ అయ్యారు.



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

జగన్ దిగిపోతేనే రాష్ట్రానికి మేలు

● 1,523వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 17: జగన్‌రెడ్డి దిగిపోతేనే రాజధాని అమరావతికి మేలు జరిగి రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని 33వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శనివారం నాటికి 1,523వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడారు. ఎక్కడా అభివృద్ధి చేయకుండా జనానికి సంక్షేమ పథకాలని పప్పుబెల్లాలు పంచి, అందినకాడికి వైసీపీ నేతలు దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఇరవై సంవత్సరాలు వెనకబాటుకు గురి చేశారన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారన్నారు. అందుకే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అమరావతి అభివృద్ధిని కొనసాగించమని తీర్పు చెప్పిందన్నారు. అమరావతి అభివృద్ధితో రాష్ట్ర ప్రగతి విరాజిల్లుతుందన్నారు. కాని సీఎం జగన్‌రెడ్డి అమరావతి నాశనం కోరుకోవటంతో రాష్ట్రాభివృద్ధి అగమ్యగోచరమైందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధి పనులు కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి తాడికొండ నియోజకవర్గాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

దాడి చేసినవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు

● గాయపడిన ఇరువురు పరిస్థితి దారుణంగా ఉంది

● టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17: జంగమేశ్వరపాడులో జరిగిన దాడిలో గాయపడిన ఇరువురు పరిస్థితి దారుణంగా, ఉందని టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. శనివారం మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం జంగమేశ్వరపాడులో వైసీపీ దాడిలో గాయపడి నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులను టీడీపీ నియమించి త్రీమెన్ కమిటీ సందర్శించి పరామర్శించింది. ఈ కమిటీలో బాలాజీతో పాటు టీడీపీ రాష్ట్ర టీడీపీ యాదవ సాధికార కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ జోనల్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఏవరైతే దాడి చేశారో వాళ్ళమీద కేసులు లేవని, వారంతా స్వేచ్ఛగా తిరుగుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే రాజకీయ స్వలాభం కోసం బలహీన వర్గాల మధ్య కక్షలు పెంచారని ఆరోపించారు. గతంలో జల్లయ్య అనే అతనిని చంపేశారని, ఎవరైతే జల్లయ్యను హత్యచేశారో వాళ్ళే మళ్ళీ జంగమేశ్వరపాడులో దాడి చేశారని అన్నారు. ఎస్పీ శాంతి, భద్రతలను ఎందుకు అదుపు చేయలేకపోతున్నారని నిలదీశారు. ఎమ్మెల్యే, ఆయన తమ్ముడి ఇంట్లో శుభకార్యక్రమం జరిగితే బలహీనవర్గాల మీద దాడి చేసి రక్తం కళ్ళ చూడటం ఒక రాక్షస క్రీడన్నారు. ఈ రాక్షస క్రీడకు త్వరలోనే చరమగీతం పాడతామన్నారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించడానికి కూడా బంధువులు, మహిళలు భయపడి పోతున్నారని అన్నారు. బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. టీడీపీ నరరావుపేట నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవినీతి, దుర్మార్గాలు ఎక్కువ అయ్యాయన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ వచ్చిన తర్వాత క్రైమ్ రేటు పెరిగిందన్నారు. బాధితులకు పోలీసులు, కలెక్టర్ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు, రాంబాబు, బాధిత గ్రామస్తులు, బంధువులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

పల్నాటి ప్రజలే ముందుండి నడిపించారు..

● అందరి మన్ననలు పొందడానికి అవకాశం ఇచ్చింది వారే..

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17: అందరి మన్ననలు పొందడానికి కారణం పల్నాటి ప్రజలేనని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శనివారం నరసరావుపేట ఎన్జీవో కాలనీ ఎంపీ కార్యాలయంలో నరసరావుపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఎంపీతో సమావేశమై సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభిమానించిన వ్యాపారులకు ధన్యవాదాలు తెలిపారు. పల్నాటి ప్రజలు తప్పు చేస్తే ముఖంమీద చెప్పే వ్యక్తులేనని అన్నారు. మంచిపేరు సంపాదించుకోవడానికి కారణం ఇక్కడ ఉన్న ప్రజలేనని ప్రశంసించారు. వరికపూడిశల ప్రాజెక్టుకు అనుమతులు అన్ని తీసుకురావడం జరిగిందన్నారు. పనులు ప్రారంభమైతే ఏడాదిలో పూర్తి అవుతుందన్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ స్థిరీకరణ గురించి ఆలోచిస్తున్నానని అన్నారు. వర్షాలు దండిగా పడితే కుడికాలువకు నీరు వస్తుందని, గోదావరి, కృష్ణ అనుసంధానం జరిగితేనే సమస్య పరిష్కారం అవుతుందని, వచ్చే ఐదు సంవత్సరాల్లో అది సాధించేలా కృషి చేస్తామన్నారు. కేంద్రప్రభుత్వం పీఎంసీ పథకంతో ముందుకువచ్చిందని, కేంద్రీయ విద్యాలయం స్థాయిలో ఉండే పీఎంసీ స్కూల్ ప్రతి మండలంలో ఉండే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఉండాలన్నారు. ఇక్కడ ఉన్న యువతకు టెక్స్‌టైల్స్, లేదా మిర్చికి సంబంధించి సెజ్ ఏర్పాటు చేస్తే ఉపాధి కల్పించిన వారం అవుతామన్నారు. టెక్స్‌టైల్స్, మిర్చికి సంబంధించిన సెజ్ కేంద్రప్రభుత్వం ద్వారా సాధించుకోవాల్సిన అవసరం ఉందని, రాబోయే ఐదు సంవత్సరాల్లో అది సాధించే దిశగా పనిచేస్తామన్నారు. తటస్థులుగా ఉండే వ్యాపారులు ప్రజలను చైతన్యపరిచి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు మాజేటి వెంకటేష్, ఆర్యవైశ్య సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, వనమా శివ, వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

మిగిలింది డొక్కు బస్సులే..

● జీటీ రోడ్డులో నిలిచిన ఆర్టీసీ బస్సు

● మరో బస్సు కోసం ప్రయాణీకుల పడిగాపులు

గుంటూరు, ఫిబ్రవరి 17: అసలే సగం డొక్కు బస్సులు.. అందులో కండిషన్‌లో ఉన్న సర్వీసులను సీఎం సభకు తరలించారు. మిగిలిన బస్సులు మొరాయిస్తూ మార్గమధ్యలోనే నిలిచిపోతున్నాయి. శనివారం రాత్రి పది గంటల సమయంలో గుంటూరు నుంచి నరసరావుపేట వెళుతున్న నరసరావుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జీటీ రోడ్డులోని మెడికల్ క్లబ్ సెంటర్‌లో ఆగిపోయింది. సాంకేతిక లోపంతో నిలిచిన బస్సును బాగుచేసేందుకు సిబ్బంది విశ్వప్రయత్నాలు చేసి గుంటూరులోని అధికారులకు సమాచారం అందించారు. మరొక సర్వీసు పంపించాలని కోరారు. మరొక బస్సు వచ్చే వరకు ప్రయాణీకులు పడిగాపులు కాయాల్సివచ్చింది. నగరంలో నిలిచిపోయింది కాబట్టి సరిపోయింది ఎక్కడో జాతీయ రహదారి మధ్యలో నిలిచిపోతే పరిస్థితి ఏంటంటూ ప్రయాణీకులు వాపోయారు. అనంతపురంలో ఈ నెల 18న సీఎం జగన్ నిర్వహించే సిద్ధం సభకు ఉమ్మడి జిల్లా నుంచి 292 సర్వీసులు తరలించారు. విభజిత జిల్లాల నుంచి సగం సర్వీసులను సీఎం సభకు తరలించారు. అందునా కండిషన్‌లో ఉన్న సర్వీసులను తరలించి డొక్కు బస్సులను ప్రయాణీకులకు వదిలేశారు. మార్గమధ్యంలోనే డొక్కు బస్సులు మొరాయిస్తున్నాయి. పల్నాడు ప్రాంతానికి వెళ్ళేందుకు అనేకమంది ప్రయాణీకులు గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని పల్నాడు బస్టాప్‌లో అర్ధరాత్రి వరకు బస్సుల కోసం పడిగాపులు కాశారు.

నేటి నుంచి రిలే దీక్షలు.. అటుపై సమ్మెలోకి..

● వీఆర్‌ఏ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17: విజయవాడ ధర్నా చౌక్‌లో ఈనెల 18, 19 తేదీల్లో జరిగే రిలేదీక్షలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. ఉమామహేశ్వరావు పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేటలో సీఐటీయూ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్, 2018నుంచి రికవరీ చేసిన డీఏ బకాయిలు తిరిగి చెల్లింపులు, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించడం, అర్హులైనవారికి పదోన్నతి తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికలకు ముందు విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగిన వీఆర్‌ఏల ధర్నా శిబిరానికి సీఎం జగన్‌మోహనరెడ్డి హాజరై మన ప్రభుత్వం వచ్చిన వెంటనే వీఆర్‌ఏల జీతం రూ.15000కు పెంచుతామని చెప్పి, ఇప్పుడు మాత్రం 2018 నుంచి రూ.300 చొప్పున డీఏని జీతాల నుంచి సుమారు రూ.15వేలు ప్రభుత్వం రికవరీ చేసిందని గుర్తుచేశారు. సమస్యలపై పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రెండు రోజులు పాటు జరిగే దీక్షలకు దిగిరాకపోతే, ఈనెల 20 తరువాత ఏ రోజునైనా నిరవధిక సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. సమావేశంలో యూని యన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగి సాహెబ్, కోశాధికారి వడ్డే బాజీబాబు, జిల్లా నాయకులు బీ లక్ష్మణరావు, బీ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కే ఉమామహేశ్వరరావు, పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

25న ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

కొల్లూరు, ఫిబ్రవరి 17: ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సీనియర్స్ పురుషుల జట్టు ఎంపికను ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి డి.నెల్లిరెడ్డి శనివారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో జరిగే ఎంపికల్లో జిల్లా జట్టుకు ఎంపికైనవారు మార్చి 8, 9, 10 తేదీలలో నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరిగే 70వ అంతర్‌జిల్లా పోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు 25వ తేదీన ఉదయం 9 గంటలకు బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. క్రీడాకారులు 85 కిలోల బరువు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 99893 48699, 94902 74746 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు, ఫిబ్రవరి 17: స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటుకూరులో గల శ్రీతిరుమల అయ్యప్ప రియల్ ఎస్టేట్ ప్లాట్‌లలో నల్లచెరువుకు చెందిన కలవ నాగపూజను హత్యచేసిన కేసులో నిందితుడైన రేటూరి నాగరాజును నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలు ఉపయోగించి ఆమెను హత్య చేసిన విషయం విదితమే. దీనిపై నల్లపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదుచేసి దర్యాప్తు చేసి సదరు కేసులోని నిందితుడైన కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన రేటూరి నాగరాజుని అదుపులోకి తీసుకున్నారు. అతడు, నాగపూజను తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. నాగపూజపై అనుమానంతో ఈ హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని సీఐ రాంబాబు తెలిపారు. కాగా నిందితుడు నాగరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చేబ్రోలు, ఫిబ్రవరి 17: చేబ్రోలు మండల శివారులో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు గ్రామానికి చెందిన బుర్రి నాగరాజు ప్రైవేటు బ్యాంక్‌లో పని చేస్తూ విధులు ముగించుకొన్ని ఇంటికి బయల్దేరాడు. నారాకోడూరు గ్రామం నుంచి లేమల్లెపాడు గ్రామం రోడ్డులో ఓ మహిళను ఢీకొని ద్విచక్ర వాహనం పైనుంచి కిందకు పడిపోయాడు. ప్రమాదంలో బుర్రి నాగరాజు (33) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన మహిళను చికిత్స నిమ్మిత్తం గుంటూరు తరలించారు. ఈ ప్రమాదంపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



నాగరాజు మృతదేహం

కృష్ణానదిలో ఈతకు దిగి వ్యక్తి...

తాడేపల్లి, ఫిబ్రవరి 17: తాడేపల్లి మండలం ఉండవల్లి సమీపంలోని కొండవీటి వాగు ఎత్తిపోతల ప్రాంతంలో శనివారం ఓ వ్యక్తి ఈతకు దిగి ప్రాణాలు కోల్పోయాడు. విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన కుంచే లోకేశ్ (27) భార్య, ఇద్దరు పిల్లలతో శనివారం సాయంత్రం నది వద్దకు వచ్చి స్నానానికి దిగారు. పిల్లలకు స్నానం చేయించిన అనంతరం లోకేశ్ కొద్దిసేపు నీటిలోనే ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. లోకేశ్ బయటకు రాకపోవడంతో భార్య కమలకుమారి స్థానిక మత్స్యకారులకు విషయం తెలిపింది. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మత్స్యకారుల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. మృతుడు బజాజ్ క్యాపిటల్‌లో పని చేస్తాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాడేపల్లి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా - ఒకరు...

వెల్దుర్తి, ఫిబ్రవరి 17: అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కండ్లకుంటలో జరిగింది. మండలంలోని గుండ్లపాడు గ్రామానికి చెందిన కంభంపాటి చిన దానియేలు (45) పశువుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం కండ్లకుంటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆటో ఎక్కాడు. గ్రామం దాటగానే ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న తెలంగాణ రాష్ట్రం దేవరకొండకు చెందిన శాంతితోపాటు మరో మహిళ గాయపడ్డారు. వీరిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా చినదానియేలు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శాంతి, మరో మహిళ చికిత్స పొందుతున్నారు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని చిన దానియేలు భౌతికకాయాన్ని సందర్శించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి మట్టి ఖర్చులకు రూ.20వేలను అందించారు.



చిన దానియేలు మృతదేహం

చంద్రబాబుది సంక్షేమం.. జగన్‌రెడ్డిది శాడిజం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



టీ స్టాల్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 17: ముఖ్యమంత్రులుగా చంద్రబాబుది సంక్షేమం అయితే జగన్‌రెడ్డిది శాడిజం అనే విషయం ఈ ఐదు సంవత్సరాల్లో ప్రతి ఒక్కరికి అనుభవంలోకి వచ్చిందని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. అందుకే ఎన్నికలు ఎప్పుడు వస్తాయా?, ఆ సైకోరెడ్డి ఎగ్జిట్ బటన్ నొక్కి ఎప్పుడు విముక్తి పొందుదామా? అని ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. అందుకే జగన్ ఇప్పుడు ఓటమి సంకేతాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేయటం, బెదిరించటం పై దృష్టి పెట్టినట్టు కన్పిస్తుందన్నారు. జగన్ ఓడిపోతే సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నది పచ్చి అబద్ధమన్నారు. సంక్షేమ పథకాలు జగన్ రాక ముందు కూడా ఉన్నాయి. జగన్ పోయిన తరువాత కూడా కొనసాగుతాయని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని కృష్ణమహల్ రోడ్డులో టీ దుకాణం వద్ద ఆగిన ప్రత్తిపాటి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలసి టీ తాగారు. టీడీపీ అధికారంలోకి వస్తే అంతా మంచి జరుగుతుందని ప్రత్తిపాటి వారికి భరోసా ఇచ్చారు. మరింత సంక్షేమం దిశగా చంద్రబాబు ఆలోచనలు చేస్తున్నారని, సూపర్ - 6 పథకాల రూపంలో ఈ నమూనాలను ఇప్పటికే ప్రజల ముందు పెట్టారని ఆయన గుర్తు చేశారు.

పోస్టింగ్‌లు పెడుతున్నాడనే అక్కసుతో దాడి

● అర్ధరాత్రి టీడీపీ సానుభూతిపరుడిపై వైసీపీ మూకల దాష్టీకం

● అడ్డువచ్చిన కుటుంబ సభ్యులపైనా..

పెదనందిపాడు, ఫిబ్రవరి 17: సోషల్ మీడియాలో వైసీపీకి వ్యతిరేకంగా పోస్టింగ్‌లు పెడుతున్నాడనే అక్కసుతో వైసీపీ మూకలు దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని కొప్పర్రులో చోటు చేసుకుంది. కొప్పర్రుకు చెందిన షేక్ జానీబాషా(ఫోటోగ్రాఫర్) పెదనందిపాడులో ఓ ఫంక్షనుకు వెళ్తుండగా అదే సమయంలో బీసీ కాలనీ వద్ద ఫ్లెక్సీలు కట్టేందుకు సిద్ధంగా ఉన్న వైసీపీ నాయకులు ఫ్లెక్సీని కావాలనే అతనిపై విసిరేశారు. జానీబాషా ఎందుకు వేశారు అని ప్రశ్నించగా వారు దుర్భాషలాడారు. దీంతో కుటుంబసభ్యులు కలుగజేసుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. జానీబాషా తండ్రి మస్తాన్‌వలిని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి దాడికి గల వివరాలు సేకరించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

సబ్ జైలు ఖైదీల తరలింపు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 17: సబ్ జైలు ఖైదీలను తరలించినట్లు జైలు సూపరింటెండెంట్ కృష్ణారావు శనివారం తెలిపారు. ఇక్కడ ఉన్న 36మంది ఖైదీలలో ముగ్గురు మహిళా ఖైదీలను గుంటూరు సబ్ జైలుకు, 10మంది ఖైదీలను బాపట్ల సబ్ జైలుకు, 23 మంది ఖైదీలను రేపల్లె సబ్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు. తెనాలి సబ్‌జైలు 100 సంవత్సరాల పూర్వం బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన సబ్‌జైలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఈ స్థానంలో నూతన సబ్‌జైలు నిర్మాణానికిగాను ఖైదీలను తరలించి త్వరలో నిర్మాణపనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.42 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

సాధారణ ఎన్నికలకు అధికారులు సంసిద్ధం కావాలి : కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 17 : రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణకు అన్ని వనరులు సమకూర్చుకొని అధికారులు సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఏఈఆర్‌వోల సమావేశం శనివారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ఏ సమయంలో వచ్చినప్పటికి జయప్రదంగా ఎన్నికలు నిర్వహించటానికి అధికారులు సమగ్రప్రణాళికతో ముందుకు సాగాలని చెప్పారు. ఓటర్లజాబితాలో చేర్పులు, సవరణల కొరకు నమోదైన దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమయ్యే 8 రోజుల ముందు వరకు నూతన ఓటర్ల చేర్పులకు అనుమతులు ఉంటాయన్నారు. వేమూరు నియోజకవర్గంలో 911, బాపట్లలో 1119, పర్చూరులో 1677, అద్దంకిలో 2017, చీరాలలో 1586 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంపై ఆరాతీశారు. వీఆర్వోల వద్ద ఎట్టి పరిస్థితులలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండరాదన్నారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్‌లు విధిగా పరిశీలించి కనీస సౌకర్యాలపై ఈనెల 27వ తేదిలోగా నివేదిక ఇవ్వాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల సామాగ్రి డిస్టిబ్యూషన్, స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ఈఆర్‌వోలను కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. రూట్ మ్యాప్ పంపాలని, కమ్యూనికేషన్ వ్యవస్థపై రూపొందించిన ప్రణాలికపై ఈనెల 20వ తేది నాటికి నివేదిక ఇవ్వాలనారు. 1400 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలు జిల్లాలో 12 ప్రాంతాలలో ఉన్నాయని ఎన్నికల నాటికి అగ్జిలరి పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్య ఉన్న పోలింగ్ కేంద్రాలను, తీవ్ర సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రాఫర్లు, స్వీప్‌క్యాంపస్ అంబాసిడర్లు, బూత్ స్థాయి అవగాహన బృందాలను ఈనెల 26వ తేదిలోగా నియమించుకోవాలని తెలిపారు. సెక్టార్ ఆఫీసర్లకు మేజిస్టీరియల్ అధికారాలు ఇస్తామన్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి 9 చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను నియమించాలని ఈఆర్‌వోలను ఆదేశించారు. మూడుచొప్పున స్టాటిస్టికల్ సర్వేలైన్స్‌టీమ్‌లు, మైక్రో అబ్జర్వర్లును నియమించాలన్నారు. హోమ్‌ఓటింగ్ విధానం కొరకు పోలింగ్ కేంద్రాల వారిగా దివ్యాంగులను మ్యాపింగ్ చేయాలన్నారు. అర్హులైన పేదలందరికి ఇంటినివేశన స్థలాలు ఈనెల 20వ తేదిన పంపిణి చేయటానికి అధికారులు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ సి.హెచ్ శ్రీధర్ తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. తక్షణమే వారికి పట్టాలిచ్చే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్ సత్యబాబు, జిల్లాఅధికారులు, ఈఆర్‌వోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ఇంటింటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని సరఫరా చేయాలి

బాపట్ల, ఫిబ్రవరి 17 : సామాజిక ఒప్పంద విధానంతో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ద్వారా అధికారులు సురక్షిత నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. జలజీవన్‌మిషన్‌లో సామాజిక ఒప్పంద విధానంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వేసవినాటికి ఇంటింటికి కుళాయికనెక్షన్ ఇచ్చే ప్రక్రియ పూర్తిచేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలలోని మహిళలను జలసంఘాలలో సభ్యులుగా చేర్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా 441 జలసంఘాలు నియమించామన్నారు. రూ.5లక్షల లోపు విలువైన పనులను జల సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. 2,24,131 కుళాయి కనెక్షన్‌లు ఇవ్వటానికి సమగ్రప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 1,155 పనులను 53.432 కోట్లరూపాయలతో చేపడుతున్నామని వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విద్యాసాగర్ ప్రకాశం, జడ్ పిసిఈవో బి.జాలిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ బి.అర్జునరావు, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో ప్రతిభ ప్రోత్సాహానికి పోటీ పరీక్షలు : డీఈవో

బాపట్ల టౌన్ ఫిబ్రవరి 17 : విద్యార్థులలో ప్రతిభ ప్రోత్సహించటానికి పోటీ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు అన్నారు. విజయవాడలో శనివారం నిర్వహించిన ఈఈఎంటి-2024 పరీక్షకు జిల్లాలో వివిధ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచారని తెలియజేశారు. మెరిట్‌కాంపిటేషన్ టెస్ట్‌లో జిల్లాలో 10వ తరగతి విభాగంలో బల్లికురవ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌కు చెందిన చెన్నా ప్రగడ సత్యసాయి (ప్రథమ), మార్టూరు మండలం బొబ్బేపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్‌కు చెందిన బి.వెన్నెల ద్వితీయ స్థానం, నగరం మండలం ఉల్లిపాలెం జడ్పీహెచ్ఎస్ స్కూల్‌కు చెందిన జ్యోతిసాయి ద్వితీయ స్థానాలలో విజేతలుగా నిలిచారన్నారు. 7వ తరగతి విభాగంలో వేటపాలెం మండలం పందిళ్ళపల్లి జడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన బి.లలితసాయి ప్రథమ, బల్లికురవ మండలం కొచ్చెరపాడు జడ్పీహెచ్‌కు చెందిన బి.భగత్ (ద్వితీయ), అదేపాఠశాలకు చెందిన లక్ష్మీ అమూల్య (తృతీయ) స్థానాలలో విజేతలుగా నిలిచారని తెలిపారు. విజేతలైన విద్యార్థులకు జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ సాదిక్, వివిధపాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళన

బాపట్ల, ఫిబ్రవరి 17 : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో శనివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ వేసినప్పటికి నేటికి ఏమాత్రం ప్రగతి లేదని వారు పేర్కొన్నారు. 2023 జూలై ఒకటి నుంచి పిఆర్‌సి అమలు కావాల్సి ఉందన్నారు. తక్షణమే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు సొంత డబ్బును తీసుకోవటానికి దరఖాస్తు చేసుకున్న నెలలు తరబడి పెండింగ్‌లో ఉంచటం సరికాదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించే విషయంలోను నేటికి ఒక స్పష్టత రాలేదన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసు సమర్పించి ఆంధ్రప్రదేశ్ జేఏసీ పక్షాన బాపట్లలో నిరసన తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, కార్యదర్శి జి.ఇస్సాకు, ఏపీటీఎఫ్ నాయకులు చాంద్‌బాషా, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె.వినయ్‌కుమార్, ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాసరావు, అమర్‌నాథ్, సీహెచ్ సుబ్బారావు, రామ్మోహనరావుపాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు

26న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

● బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి

బాపట్లటౌన్, ఫిబ్రవరి 17 : స్థానిక బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ క్రీడాప్రాంగణంలో ఈనెల 26న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి అన్నారు. కళాశాలలో అధ్యాపకులతో కలిసి శనివారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఫార్మశీ కళాశాలల విద్యార్థులు ఈ క్రీడా పోటీలలో పాల్గొనాలన్నారు. బాలుర విభాగంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షార్ట్‌పుట్, చెస్, క్యారమ్స్, బాలికల విభాగంలో త్రోబాల్, షార్ట్‌పుట్, చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరి కొమ్మినేని హరిపద్మప్రసాద్, ట్రెజరర్ తాళ్ళూరి రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేందుకు మోడల్ పరీక్షలు

బాపట్లటౌన్, ఫిబ్రవరి 17 : విద్యార్థులలో ప్రతిభను, సృజనాత్మకతను పెంపొందించేందుకు 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలు ఎంతో దోహదపడుతాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్య అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలపై విద్యార్థులలో భయం పోగొట్టటానికి మోడల్ పరీక్షలు ఎంతో దోహదపడతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి మోడల్ పరీక్షకు సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులతోపాటు ప్రశంసాపత్రాన్ని త్వరలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కళ్యాణ్‌చక్రవర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బాపట్ల పార్లమెంట్ నాయకులతో కలిసి రా కదలిరా సభ ప్రాంగణంలో దగ్గుమళ్ళ ప్రసాదరావు



పార్టీశ్రేణులతో కలిసి బైక్‌ర్యాలీతో ఇంకొల్లు సభకు తరలివెళుతున్న వేగేశన నరేంద్రవర్మ

చంద్రబాబు సభకు తరలివెళ్లిన తెలుగుతమ్ముళ్లు

బాపట్ల, ఫిబ్రవరి 17 : తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ సీటు ఆశిస్తున్న విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో చంద్రబాబునాయుడు సభకు తరలివెళ్ళారు. జిల్లాలోని పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో జరిగిన రా కదలిరా కార్యక్రమానికి పార్లమెంట్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు దగ్గుమళ్ళతో కలిసి వెళ్ళారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలలో అక్కడకు వెళ్ళి అధినేత చంద్రబాబునాయుడుకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఆయన భుజం తట్టి ప్రజలకు అభివాదం చేశారు. బహిరంగవేదిక ఏర్పాట్లపై ప్రశంసించారు. దీంతో దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఆయన అనుచరులు పెద్దఎత్తున హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం కావాలని బాపట్లపార్లమెంట్‌లో దగ్గుమళ్ళ ప్రసాదరావు సేవలు అవసరమని అభిమానులు నినాదాలు చేశారు. పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాలు నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు, దగ్గుమళ్ళ కలిసి రావటం చూచి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాధేయ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండి దగ్గుమళ్ళ రాధేయ్, టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరయ్య, బాపట్ల పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జంగం ప్రవీణ్, విశ్రాంత సీఈవో జంగం రాజశేఖరరావు, పర్చూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి నాగరాజు, దేవరపల్లి రాజేష్, బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, బాపట్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, షేక్.నజ్మా తదితరులు పాల్గొన్నారు.

పార్టీశ్రేణులతో తరలి వెళ్ళిన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 17 : రా కదలిరా కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు పెద్దసంఖ్యలో తరలి వెళ్ళారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 3000 వాహనాలలో 15 వేల మంది ప్రజలను తరలించారు. అదేవిధంగా ద్విచక్రవాహనాలతో స్వర్ణపురం గ్రామం నుంచి ర్యాలీగా ఇంకొల్లు బహిరంగసభకు తరలి వెళ్ళారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ ఓటు అనే ఆయుధంతో వైసీపీ అరాచకపాలనకు చరమగీతం పాడాలన్నారు. వైసీపీపాలనలో పంటకాల్వలు, మురుగుకాల్వలు బాగు చేయకపోవటం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. తెలుగుదేశం, జనసేన సంకీర్ణ ప్రభుత్వంతోనే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సభకు తరలివెళుతున్న పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళలు

● పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 17 : పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లు మండలంలో శనివారం మధ్యాహ్నం జరిగిన తెలుగుదేశం పార్టీ పిలుస్తుంది రా కదలిరా బహిరంగ సభకు బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో శనివారం పిట్టలవానిపాలెం మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్ళారు. మండలవ్యాప్తంగా 380 ఆటోలలో, 50 కార్లలో, 150 ద్విచక్ర వాహనాలతో పార్టీ శ్రేణులు సభకు స్థలానికి రెట్టింపు ఉత్సాహంతో తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, తెలుగు మహిళా మండల అధ్యక్షులు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మంరాజు వెంకటపతిరాజు, మోదుగుల శంకరరెడ్డి, మాజీ ఎంపీపీ బొలగాని వెంకటసులోచన నారాయణ, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కలకోట కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, ఫిబ్రవరి 17 : మండల నలుమూలల నుంచి 200లు వాహనాలకు పైగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభకు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు శనివారం భారీగా తరలి వెళ్ళారు. కార్యక్రమానికి టీడీపీ నాయకులు నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, బోజరాజు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, పిట్ల వసంతరెడ్డి బొద్దుకూరి విజయ, మద్దాల ముసలయ్య, మాజీ ఎంపీటీసీ షేక్ బాజి, కట్టాసుజాత, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వందలాదిమంది కార్యకర్తలు భారీగా తరలి వెళ్ళారు.



ఇంకొల్లు సభకు బయలుదేరిన ఐలవరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● భట్టిప్రోలు, ఫిబ్రవరి 17 : పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో శనివారం జరిగిన చంద్రబాబునాయుడు రా కదలిరా సభకు మండలం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్ళారు. కార్లు, బస్సులు, ఆటోలలో ఇంకొల్లుకు బయలుదేరి వెళ్ళారు. గ్రామ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. మండలంలోని ఐలవరం గ్రామం నుంచి గ్రామ పార్టీ అధ్యక్షుడు మాచర్ల నాగరాజు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఇంకొల్లుకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో దీపాల శివప్రసాద్, కూరపాటి రఘురామయ్య, జొన్నాదుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, ఫిబ్రవరి 17 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇంకొల్లులో నిర్వహిస్తున్న రా కదలిరా సభకు పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో మండల గ్రామాల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు టాటా ఏస్‌లు, కార్లు తదితరల వాహనాలపై పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లులో జరుగుతున్న సభకు ఉత్సాహంగా తరలివెళ్లారు. అమృతలూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కార్లు, తదితర వాహనాలతో తరలివెళ్లారు.

● వేమూరు, ఫిబ్రవరి 17 : ఇంకొల్లులో శనివారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ రా కదలిరా కార్యక్రమానికి మండల పరిధి గ్రామాల నుండి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్ళారు. 17గ్రామాల నుండి కార్లు, ద్విచక్ర వాహనాలపై పార్టీ జెండాలు కట్టుకుని నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్ళారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఇచ్చిన పిలుపు మేరకు పార్టీకి చెందిన అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమైక్యంగా వెళ్ళారు. కొద్ది రోజుల్లో తెలుగుదేశం పార్టీ తీర్థాన్ని పుచ్చుకోనున్న మరికొందరు వైసీపీ శ్రేణులు కూడా సభకు వెళ్ళడం విశేషం. వేమూరులో బాపట్ల నియోజకవర్గ పరిధి పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయ్‌బాబు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జంపనిలో రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హనీఫ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో సభకు వెళ్ళారు.



సభకు వెళుతున్న వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న అధికార ప్రతినిధి విజయబాబు

ఎయిడ్స్ కళాజాతతో ప్రజలకు అవగాహన

కర్లపాలెం, ఫిబ్రవరి 17 : ఎయిడ్స్ నియంత్రణపై జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో కర్లపాలెం బస్టాండ్ సెంటర్‌లో గాయత్రి కల్చరల్ సొసైటీ కళాజాత టీమ్ ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ కళాజాత ప్రదర్శన కార్యక్రమంలో ఆరుగురు బృందం సభ్యులతో ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఎయిడ్స్, టీబీ వ్యాధులపై మరికొన్ని ఆరోగ్యవిషయాలపై కళాకారులు జానపద గీతాలతో, వీధినాటకాల ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమలో బాపట్ల జిల్లా ఏపీ శాక్స్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీబాషా, ఐసీటీపీ కౌన్సిలర్ స్వాములు, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులు అరెస్టు

బాపట్ల,ఫిబ్రవరి 17 : సీపీఎస్ రద్దు కోరుతూ నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్ళకుండా కట్టడి చేసేందుకు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాపట్లరూరల్ పోలీసులు పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులను శనివారం అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈస్ట్ బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, ఉపాధ్యాయులు బడుగు శ్రీనివాస్, సురేష్, వీఆర్వో నాగేశ్వరరావులను తీసుకెళ్ళి సంతకాలు తీసుకొని సొంత పూచీకత్తుపై పంపించారు.



పోలీస్‌స్టేషన్‌లో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులు

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : డీఈవో

బాపట్ల, ఫిబ్రవరి 17 : జిల్లాలోని ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరింటానికి కృషి చేస్తానని డీఈవో కె.నారాయణరావు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నారాయణరావును ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, డైరీని అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. వాటిని పరిష్కరిస్తానని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం, సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



డీఈవోను కలిసి పుష్పగుచ్ఛం, ఏపీటీఎఫ్ డైరీని అందజేస్తున్న నాయకులు

నేడు జరుగులమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ

వేమూరు, ఫిబ్రవరి 17 : మండల పరిధిలోని జంపని గ్రామంలో చరిత్ర ప్రసిద్ధి చెందిన గ్రామ దేవత జరుగులమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఉదయం ఆగమ శాస్త్ర ప్రకారం అత్యంత వైభవంగా జరగనుంది. మూడు రోజుల దీక్షతో ప్రారంభమైన క్రతువులో భాగంగా శనివారం 1500మంది మహిళలు భక్తితో దీక్షతో పసుపు చీరలు, ధరించి నీటి బిందెలతో గ్రామంలో భగవాన్ నామస్మరణలతో పెద్ద ఎత్తున ఊరేగింపు జరిపారు. అనంతరం ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న అమ్మవారి విగ్రహానికి జలాభిషేకం జరిపారు. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున విగ్రహాన్ని ఊరేగించారు. మేళతాళాలు, వేద మంత్రాలు నామ సంకీర్తనలు కోలాట భజనలతో ఊరేగింపు వైభవంగా జరిగింది.

రక్షణ సైన్యం చర్చి ప్రథమ వార్షికోత్సవం

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 17 : మండల పరిధిలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని గడ్డంవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్షణ సైన్యం చర్చి ప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవం సందర్భంగా శనివారం బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి గ్రామ పెద్దలు, చర్చి పాస్టర్‌లతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ఖాజీపాలెం గ్రామసర్పంచ్ కె.అనూష ప్రసన్నరాజు, ఖాజీపాలెం ఎంపీటీసీ కె.కాంతకుమారి, ఖాజీపాలెం సొసైటీ అధ్యక్షుడు కూసంపూడి దేవేంద్రరాజు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గుమ్మడి సీతయ్య, యోహాను పాల్గొన్నారు.

శీతలీకరణ పరికరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

బాపట్లటౌన్, ఫిబ్రవరి 17 : పార్థివదేహం ఉంచే శీతలీకరణం పరికరం, పవర్ జనరేటర్‌ను వివిధ గ్రామాల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని చెరువుజమ్ములపాలెం గ్రామస్తులు తెలియజేశారు. శనివారం గ్రామంలో మహాప్రస్థానంలో ఏర్పాటు చేసిన రూ.4 లక్షల శీతలీకరణ పరికరం (ఫ్రిజర్‌బాక్స్), పవర్ జనరేటర్‌ను గ్రామస్థులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్థివదేహం ఫ్రిజర్ బాక్స్‌లో 15 రోజుల వరకు ఉంచుకోవచ్చునని దానికి సంబంధించిన పవర్ జనరేటర్ సదుపాయాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. చెరువుజమ్ములపాలెం గ్రామానికి చెందిన కరణం వెంకటేశ్వరరావు, శోభారాణి జ్ఞాపకార్థం వారి కుమార్తెలు సమత, రమ్యలు రూ.4 లక్షలతో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంగులూరి గోపాలరావు, కరణం యజ్ఞేశ్వరరావు, మెట్ల సుబ్బారావు, పువ్వాడ బసంత్, కరణం రవీంద్రబాబు, కుర్రా పుండరీకాక్షుడు పాల్గొన్నారు.

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం

వార్షిక కల్యాణ మహోత్సవాలకు ముస్తాబు

బాపట్ల,ఫిబ్రవరి 17 : పట్టణంలోని త్యాగరాయనగర్‌లో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక కళ్యాణ మహోత్సవాలు నిర్వహించేందుకు శ్రీనివాస సేవాసమితి సభ్యులు ఆలయాన్ని ముస్తాబు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈనెల 20వ తేది నుంచి 24వ తేది వరకు జరిగే వార్షిక కళ్యాణ మహోత్సవాలకు భక్తజనం పెద్దఎత్తున తరలిరావాలని సేవాసమితి సభ్యులు కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : శివప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 17 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని మోళ్ళగుంట గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ రానున్నది టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వమేనని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నుంచి రాష్ట్రంలోని ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రతిపక్షాలను అణగతొక్కేందుకు పోలీసులను అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులు బనాయించి కుట్రపూరితంగా వ్యవహరించారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి అండగా ఉండాలని, గెలుపే ధ్యేయంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు, టీడీపీ నాయకులు జీ.లక్ష్మీజీ, రేపల్లె సురేష్, కొలసాని రాము పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

● రేపల్లె, ఫిబ్రవరి 17 : రానున్న ఎన్నికల్లో వైసీపీని ప్రజలు తరిమికొట్టాలని సీనియర్ టీడీపీ నాయకుడు తొట్టెంపూడి సుభాష్ అన్నారు. మండలంలోని నల్లూరు సౌత్‌లో శనివారం బాబూ ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే, యువతకు ఉద్యోగ కల్పన రావాలంటే టీడీపీ, జనసేనతోనే సాధ్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, మోర్ల అంజయ్య, యరగళ్ళ శ్రీనివాసరావు,కేసన రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఓటర్ల ప్రక్రియ : ఆర్డీవో

రేపల్లె, ఫిబ్రవరి 17 : ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా నిష్పక్షపాతంగా చేస్తున్నామని రేపల్లె ఆర్డీవో హేలా షారాన్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు శనివారం సమ్మరీ రివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేపల్లె సబ్‌డివిజన్ పరిధిలోని రేపల్లె నియోజకవర్గంలోని ఓటర్ లిస్టులో తొలగించాల్సిన బియ్యం మార్పులు, చేర్పులకు తదితర వాటిపై సమీక్షించారు. ఓటర్ లిస్టులో తప్పులను సరిచేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవటం ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ప్రసాదం వాసుదేవ, సీపీఎం నాయకులు సిహెచ్ మణిలాల్, బీజేపీ నాయకులు అన్నం సాయివరప్రసాద్, తహశీల్దార్ సిహెచ్ రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హేలా షారాన్

వెల్లటూరు హైస్కూలులో సోషల్ ఎగ్జిబిషన్

భట్టిప్రోలు, ఫిబ్రవరి 17 : ఏపీఎస్ఎస్‌టీఎఫ్ ఫోరం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని వెల్లటూరు హైస్కూలులో శనివారం సోషల్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. సోషల్ స్టడీస్ ఎగ్జిబిషన్‌లో భాగంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రాజెక్టుల రూపకల్పన దోహదపడుతుందని హెచ్ఎం కె.అరుణకుమారి చెప్పారు. నిజాంపట్నం ఎంఈఓ శేషుగోపాల్ ఎగ్జిబిషన్‌ను తిలకించి విద్యార్థులను అభినందించారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు, ఏపీఎస్ఎస్‌టీఎఫ్ వ్యవస్థాపకులు గుర్రం మురళీమోహన్, ఎస్కే సుభానీ పర్యవేక్షించారు.

నగరం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శిల్పా

నగరం, ఫిబ్రవరి 17 : నగరం మండల తహసీల్దార్‌గా ఎ.శిల్పా శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని గ్రామాలలో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో బదిలీపై నగరం రావటం జరిగిందని అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతం పలికారు. గతంలో ఇక్కడ చేసిన తహసీల్దార్ ప్రమీల ఇంకొల్లు బదిలీపై వెళ్ళారు. ప్రస్తుతం బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సీఆర్‌డీఏ నుంచి ఇక్కడకు వచ్చారు.



తహసీల్దార్ శిల్పాకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

20 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్ఏల సమ్మె

రేపల్లె, ఫిబ్రవరి 17 : తమ హక్కులను కాపాడుకునేందుకు 20వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలు సమ్మెకు దిగుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు శనివారం సమ్మె నోటీసును వీఆర్ఏలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు పేస్కేల్ 2018 నుంచి రికవరీ చేసిన టీఏ బకాయిలను తిరిగి చెల్లించలేదని అన్నారు. రెవెన్యూ సహాయకులకు ఆరేళ్ళుగా జీతాలు పెరగక కుటుంబాలు అవస్థలు పడుతున్నారని, తక్షణమే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. 20వ తేదీ లోపు సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగరం మండల అధ్యక్షులు జీ.పీటర్, ఉపాధ్యక్షులు దయారత్నం, ఎం.ఆనంద్, మండల వీఆర్ఏలు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న వీఆర్ఏలు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం పరీక్షలు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 17 : భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రజ్ఞ వికాసంపై శనివారం పోటీ పరీక్షలను నిర్వహించారు. పరీక్ష పేపర్లను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు పి.మనోజ్ ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, యుటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షలలో పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి హైస్కూలు కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, హెచ్ఎంలు ఫణి, సి.రామకోటేశ్వరరావు, నాయకులు శ్యామ్, శివ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష పేపర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, ఉపాధ్యాయులు

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలి

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపు

ఇంకొల్లు, ఫిబ్రవరి 17: అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో అన్నివర్గాలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. శనివారం ఇంకొల్లులో జరిగిన రా కదిలి రా సభలో ఆయన మాట్లాడారు. రైతాంగానికి సరైన సమయంలో సాగునీరు అందించకపోవడంతో ఈప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గత ప్రభుత్వంలో తక్కువ నీరు ఉన్నా పంటలు పండించేలా చేసిన ఘనత చంద్రబాబుదని గుర్తుచేశారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు లేవని, ఉద్యోగాలు చేసే ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు లేవని అన్నారు. మద్య నిషేధమని ప్రగల్భాలు పలికి జేబ్రాండ్లతో సామాన్యుల జీవితాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. తెలుగుజాతి గుర్తింపునకు నిర్విరామంగా కృషిచేసే వ్యక్తి చంద్రబాబునాయుడని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అరాచక పాలనతో తప్పుడు కేసులు బనాయించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలన్నారు. ఎన్ని అడ్డంకులు పెట్టినా సభకు వేలాది మంది తరలివచ్చి సంఘీభావం తెలపడం అభినందనీయమన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మీప్రాంతంలో ఏమి అభివృద్ధి జరిగిందో, వైసీపీ పాలనలో ఏమి అభివృద్ధి జరిగిందో ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. యువత భవిష్యతును తీర్చిదిద్దే సత్తా ఉన్నా నాయకులు చంద్రబాబు అని ఏలూరి పేర్కొన్నారు.

సత్తా ఉన్న నాయకుడు ఏలూరి

సత్తా ఉన్న నాయకుడు ఏలూరి సాంబశివరావు అని చంద్రబాబు ప్రశంసించారు. ఇంకొల్లులో జరిగిన రా కదలిరా సభలో చంద్రబాబు మాట్లాడుతూ చీరాలలో చీ అన్న ఓ వైసీపీ నాయకుడు పర్చూరు నియోజకవర్గంలో కబ్జాలు, అక్రమకేసులు, ఫాం 7తో 14 వేల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నించిన దొంగపై పోరాడి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ముగ్గురు పోలీసులను సస్పెండు చేయించిన ఏలూరి సత్తా కలిగిన నాయకుడని ప్రశంసించారు. పర్చూరు ప్రాంత ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇంకొల్లులో ఆటోనగర్ ఏర్పాటుచేసి ముస్లింలకు అండగా ఉంటామన్నారు. పర్చూరులో పేదలకు 2 సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు కట్టిస్తామన్నారు. నియోజకవర్గంలో గ్రానైట్ యజమానులు ఎదుర్కొంటున్న న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పంట కాల్వలను ఆధునీకరించి సాగునీరందిస్తామని చెప్పారు. గోదావరి నీళ్లు సాగర్ కుడికాల్వకు తీసుకొచ్చి పంటలకు నీళ్లు అందించే బాధ్యత నాది అని చెప్పారు. నన్ను నమ్మండి.. మీ భవిష్యత్తులో వెలుగు నింపుతానని చంద్రబాబు పేర్కొన్నారు. సభలో ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, స్వామి, సత్యప్రసాద్, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, నక్కా ఆనందబాబు, టీడీపీ కనిగిరి, బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఉగ్ర నరసింహారెడ్డి, నరేంద్రవర్మ, ఉండవల్లి శ్రీదేవి, జనార్దన్, జనసేన నాయకులు రియాజ్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.




ఇంకొల్లులో జరిగిన రా కదలిరా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు, చంద్రబాబుతో ముచ్చటిస్తున్న ఏలూరి



చంద్రబాబు సభకు తరలివచ్చిన టీడీపీ శ్రేణులు





ఇంకొల్లులో జరిగిన రా కదలిరా సభలో చంద్రబాబుతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న టీడీపీ బాపట్ల పార్లమెంట్ నాయకుడు దగ్గుమళ్ల ప్రసాదరావు, తెలుగు మహిళల కేరింతలు, సభకు తరలివస్తున్న టీడీపీ శ్రేణులు

చంద్రబాబు సభకు భారీగా తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

మార్టూరు, ఫిబ్రవరి 17: ఇంకొల్లులో శనివారం జరిగిన రా కదలిరా చంద్రబాబు సభకు మార్టూరు, యద్దనపూడి మండలాలనుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజానీకం భారీగా తరలివెళ్లారు. ముఖ్యంగా మహిళలు భారీగా వెళ్లారు. మార్టూరులోని విద్యానగర్, తూర్పు బజారు, చౌదరి నగర్, కాకతీయ నగర్, తదితర కాలనీల నుంచి మహిళలు సొంతంగా వాహనాలలో తరలివెళ్లారు. ద్రోణాదుల గ్రామం నుంచి మూడు ట్రాక్టర్లలో మహిళలు సభకు వెళ్లారు. ఇతర గ్రామాల నుంచి కూడా కార్య కర్తలు వాహనాలలో తరలి వెళ్లారు. కొన్ని గ్రామాల నుంచి ఆటోలలో కార్యకర్తలు మధ్యాహ్నం 3 గంటలకు తరలివెళ్లారు. ద్విచక్రవాహనాలపై యువకులు, పార్టీ కా ర్యకర్తలు భారీగా చంద్రబాబు సభకు వెళ్లారు. టీడీపీ నాయకులు తాటి నాగేశ్వర రావు, కామినేని జనార్దన్, షేక్ రజాక్, కోటపాటి సురేష్, కామేపల్లి హరిబాబు, కమ్మ శివనాగేశ్వరరావు, షేక్ ఫరూక్, మిన్నెకంటి రవికుమార్, అడుసుమల్లి వెంకట శ్రీనివాసరావు, శానంపూడి చిరంజీవి, శివరాత్రి శ్రీను, మహిళా నాయకురాలు ఉప్పుటూ రు రమాదేవి తదితరులు ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

యద్దనపూడి మండలం నుంచి భారీగా వాహనాలలో నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు సభకు తరలివెళ్లారు. నాయకులు నల్లపనేని రంగయ్యచౌదరి, రావిపాటి సీతయ్య, బోయపాటి సాంబయ్య, గుదే తారకరామారావు, కోయ సతీష్, కొరటాల వంశీ తదితరుల పర్యవేక్షణలో ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు వాహనాలలో తరలి వెళ్లారు. యద్దనపూడిలో పార్టీ కార్యాయం వద్ద నుంచి 70 మంది యువకులు బైక్‌లతో ర్యాలీగా చంద్రబాబు సభకు తరలి వెళ్లారు. కనపర్తి నాగేశ్వరరావు, సూరిశెట్టి వాసు, షేక్ బాజి, సూరిశెట్టి సతీష్, జంపని వీరయ్య, టి.కొండలరాయుడు తదితరుల ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు.



చినగంజాం: రా కదలి రా సభకు తరలివెళ్తున్న టీడీపీ నేతలు

ఇంకొల్లు సభకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

చినగంజాం, ఫిబ్రవరి 17: ఇంకొల్లులో శనివారం జరిగిన రా కదలి రా సభకు చినగంజాం మండలం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో శనివారం ఇంకొల్లులో జరిగిన సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య ఆధ్వర్యంలో ఆసోది సుబ్బారెడ్డి, చెరుకూరి రాఘవయ్య, రాయని ఆత్మారావు, టి.జయరావు, నరహరి శ్రీనివాసరావు, మెటుమర్రి రామసుబ్బారావు, సందు శ్రీనివాసరావు, టి.రాజశేఖర్, నక్కల వీరరాఘవులు, వడ్లమూడి సత్యనారాయణ, యార్లగడ్డ లక్ష్మి, కోకి భాస్కర రెడ్డి, షేక్ ఖాదర్‌బాషా, దండుప్రోలు తిరుపతిరావు, కె.విష్ణు, రాజు వెంకటేశ్వరరెడ్డి, షేక్ జిలాని, సీహెచ్ వెంకటరావు, జనసేన మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జనసేన నాయకులు, జనసైనికులు వాహనాల్లో తరలివెళ్లారు.



మార్టూరులో పార్టీ కార్యాలయం నుంచి తరలివెళుతున్న టీడీపీ కార్యకర్తలు

పర్చూరులో సందడి..

పర్చూరు, ఫ్రిబవరి 17: వైసీపీ ప్రభుత్వ విధ్వంసం, అరాచక పాలనను ఎండకట్టడంతోపాటు, రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలను చైతన్యం చేసేందుకు ఇంకొల్లు వేదికగా చేపట్టిన రా తరలి రా కార్యక్రమానికి శనివారం తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివెళ్ళారు. ఆయా గ్రామాల నుంచి స్వచ్ఛందంగా నాయకులు వాహనాలను ఏర్పాటుచేసుకుని చంద్రన్న సభకు వెళ్ళారు. గ్రామాల నుంచి పర్చూరు కేంద్రంగా వాహనాలు తరలివెళ్లడంతో సందడి వాతావరణం నెలకొంది. యువకులు పెద్ద సంఖ్యలో బైక్‌పై ర్యాలీగా ఇంకొల్లు వెళ్ళారు. తొలుత స్థానిక బొమ్మల సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంకొల్లు సభకు వెళ్ళారు.

అలాగే, కారంచేడు మండలంలోని ఆయాగ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులతోపాటు, జనసేనులు భారీ ఎత్తున వాహనాలను ఏర్పాటుచేసుకుని చంద్రబాబు ఆధ్వర్యంలో చేపట్టిన రా కదలి రా సభకు తరలివెళ్ళారు. తొలుత స్థానిక కాలువ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల ద్వారా ఇంకొల్లుకు ర్యాలీగా వెళ్ళారు.

చంద్రబాబు ఇంకొల్లులో తలపెట్టిన రా కదలి రా సభను విజయవంతం చేయాలని ఇంకొల్లు మంలం ఇడుపులపాడు గ్రామానికి చెందిన సుభానీ తన ద్విచక్రవాహనంపై ఎన్టీఆర్, చంద్రబాబు, ఏలూరి ఫొటోలను ఏర్పాటుచేసి ప్రచారం నిర్వహించి అభిమానం చాటుకున్నారు. తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారం చేపట్టేవరకు తాను పార్టీ గెలుపుకోసం ఉచితంగా ప్రచారం చేస్తానని చెప్పారు.

జగన్ సభల కోసమేనా ఆర్టీసీ బస్సులు

» వైసీపీ అరాచకాలకు త్వరలో ముగింపు

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, ఫిబ్రవరి 17: సీఎం జగన్ పర్యటనలు ఎక్కడఉన్నా ఆర్టీసీ బస్సులను అక్కడికి తీసుకెళ్లడం దారుణమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. దీంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండలంలోని గుంటుపల్లి గ్రామంలో శనివారం జరిగిన ఓ కార్యక్రమానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం వలంటీర్ల సమావేశానికి బస్సులు రద్దు చేశారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో జరిగే జగన్ సభ కోసం ఉన్న బస్సులను అక్కడికి పంపుతున్నారన్నారు. ఆర్టీసీ బస్సులు ఉన్నది ప్రజల కోసమా, జగన్ కోసమా అనేది అర్థం కావటం లేదన్నారు. అదేమంటే పెత్తందార్లు, పేదలు అని జగన్ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. గ్రామాలలోని నిరుపేదలు పట్టణ ప్రాంతాలకు వైద్యం కోసం గాని, వారి పిల్లల చదువుల కోసం గాని వెళ్లాలంటే బస్సులు లేక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. ఇవేమి కనిపించని వైసీపీ ప్రభుత్వం పేదలను తీవ్రంగా మోసం చేస్తుందన్నారు.

అద్దంకి నియోజకవర్గంలో పల్లె వెలుగు బస్సులను తరచూ రద్దు చేసున్నారని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి అరాచకాలకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు త్వరలో ముగింపు పలుకుతారని అన్నారు. ఇప్పటికే ప్రజలు సార్వత్రిక ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. గ్రామాలలో టీడీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసీపీ ప్రభుత్వం బెదిరింపులకు దిగుతుందన్నారు. చంద్రబాబు సభలకు వస్తున్న జనాలను చూసి వైసీపీలో వణుకు మొదలైందన్నారు. సమావేశంలో మండల పార్టీ నేతలు మలినేని గోవిందరావు, మందలపు సుధాకర్, పుచ్చకాయల సుబ్బరామయ్య, మాలపాటి పోతురాజు, దూళిపాళ్ల పూర్ణయ్య అదిశేషయ్య, పున్నారావు, పుచ్చకాయల వెంకట్రావు, బండారు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



గుంటుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్



వాలీబాల్ విజేత సెయింట్ ఆన్స్ జట్టు

చీరాల, ఫిబ్రవరి 17: గుంటూరులోని ఆర్వీఆర్ అండ్ జేసీలో స్పోర్ట్స్ ఫెస్ట్ -2024లో భాగంగా జరిగిన వాలీబాల్ పోటీలలో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు క్రీడాకారులను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, పీఈటీ అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ విజేతగా నిలిచిన తమ కళాశాల జట్టుకు రూ.10వేలు ప్రైజ్ మనీతో పాటు, సర్టిఫికెట్లు, కప్పు అందజేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, విభాగాధిపతులు డాక్టర్ ఎస్.అనిల్ కుమార్, డాక్టర్ లక్ష్మీతులసి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



వాలీబాల్ జట్టు క్రీడాకారులతో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చంద్రబాబు సభకు కదలిన దగ్గుమళ్ళ సైన్యం

బాపట్ల, ఫిబ్రవరి 17: తెలుగుదేశంపార్టీ బాపట్ల పార్లమెంట్ సీటు ఆశిస్తున్న విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో చంద్రబాబునాయుడు సభకు తరలివెళ్ళారు. ఇంకొల్లులో జరిగిన రా కదలిరా కార్యక్రమానికి పార్లమెంట్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు దగ్గుమళ్ళతో కలిసి వెళ్ళారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలలో అక్కడకు వెళ్ళి అధినేత చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా చంద్రబాబు ఆయన భుజం తట్టి ప్రజలకు అభివాదం చేశారు. బహిరంగవేదిక ఏర్పాట్లపై ప్రశంసించారు. దీంతో దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఆయన అనుచరులు పెద్దఎత్తున హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం కావాలని బాపట్లపార్లమెంట్‌లో దగ్గుమళ్ళ ప్రసాదరావు సేవలు అవసరమని అభిమానులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాధేయ్ గ్రూప్‌ఆఫ్ కంపెనీస్ ఎండీ దగ్గుమళ్ళ రాధేయ్, టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరయ్య, బాపట్ల పార్లమెంట్ క్రిస్టియన్‌సెల్ అధ్యక్షుడు జంగం ప్రవీణ్, విశ్రాంత సీఈవో జంగం రాజశేఖరరావు, పర్చూరు నియోజకవర్గ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి నాగరాజు, దేవరపల్లి రాజేష్, బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని, బాపట్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, షేక్ నజ్మా పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్



కొప్పెరపాడులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభద్ర

బల్లికురవ, ఫిబ్రవరి 17: సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. శనివారం మండలంలోని కొప్పెరపాడు, వైదన గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలల హెచ్‌ఎంలతో మాట్లాడుతూ పోలింగ్ నిర్వహించే గదులలో విద్యుత్ వసతి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాసరావు, సర్వేయర్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 17: కక్షిదారులు విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా రాజీమార్గంలో ముందుకు సాగాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ న్యాయాధికారి ఎం.సుధ పేర్కొన్నారు. మార్చి 9న స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులకు పరిష్కారం పొందవచ్చునని తెలిపారు.

నేడు మార్టూరులో ఉచిత వైద్య శిబిరం

మార్టూరు, ఫిబ్రవరి 17: మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్లో గుంటూరు వేదాంత హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిబిరంలో పలురకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మార్టూరు ప్రాంతవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని ఆయన కోరారు.

మద్యం మత్తులో యువకుడు మృతి

పంగులూరు, ఫిబ్రవరి 17: అతిగా మద్యం సేవించి మండలంలోని జనకవరంకు చెందిన నూతలపాటి సుబ్బారావు (26) మృతిచెందాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి తల్లి మాటలు లెక్కచేయకుండా నిత్యం మద్యం సేవిస్తుంటాడు. ఈక్రమంలో ఫూటుగా మద్యం తాగిన సుబ్బారావు పంగులూరు శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయానికి పడమటి వైపు ఉన్నపొలాలలో విగతజీవుడై పడిఉన్నాడు. శనివారం ఉదయం పొలం పనులకు వెళ్ళిన కూలీలు చూసి పంచాయతీ అధికారులకు సమాచారమిచ్చారు. స్థానిక వీఆర్వో చింపారావు, మహిళా కానిస్టేబుల్ సంధ్యారాణి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకుని బంధువులకు సమాచారమిచ్చారు. అతిగా మద్యం తాగి తన కుమారుడు మృతి చెందాడని మృతుడి తల్లి తెలిపింది. మృతిపై ఎలాంటి అనుమానం వ్యక్తం చేయకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

నేడు దత్తపాదుకా క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అద్దంకి, ఫిబ్రవరి 17: అద్దంకి పట్టణంలోని దత్తపాదుకా క్షేత్రంలో ఆదివారం దత్తపీఠ ఉత్తరాధీశులు దత్తవిజయానందతీర్థ స్వామీజీచే ప్రత్యేక పూజలు, హోమం జరుగుతాయని దత్తపాదుకా క్షేత్రం కమిటీ చైర్మన్ నాగసూరి హనుమత్ ప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వాగత సభ, అనుగ్రహ బాషణ, శౌర హోమం, పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు శ్రీచక్రార్చన, దివ్యనామ సంకీర్తన జరుగుతాయని తెలిపారు.

ఆత్మీయ సభను జయప్రదంచేయాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 17: అద్దంకిలోని అంబేడ్కర్ భవనంలో ఈనెల 28వ తేది మధ్యాహ్నం 3 గంటలకు జరిగే మాదిగ, ఉప కులాల ఆత్మీయ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ ఆలూరి చిరంజీవి మాదగ కోరారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆత్మీయ సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ కందుల గంగాధర్, పల్లెపోగు త్రిపుర మాదిగ, పత్తిపాటి నాగయ్య మాదిగ, మల్లెల ప్రసాద్ మాదిగ, కొండ్రు సామ్యేలు మాదిగ, సాంసన్, దేవదాసు, బాబురావు, యేహాను, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 17: రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఎన్జీవో నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శనివారం ఎన్జీవో అద్దంకి తాలూకా అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా ఎన్జీవో కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ షేక్ బహబూబ్ సుభానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.కిరణ్‌కుమార్, తాళ్ళూరి రమేష్‌బాబు, ఏడుకొండలు, ఆర్.అమర్‌నాథ్, రమణరావు, వందనం బాబు, రవికుమార్, అర్జునరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రవికుమార్ పర్యటన వివరాలు

అద్దంకి, ఫిబ్రవరి 17: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలుకార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు రావినూతల, 10 గంటలకు అద్దంకి పట్టణంలోని 11వ వార్డు, 11.30కి గుంటూరు, 12.30 గంటలకు విజయవాడలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

బీఎస్పీ నియోజకవర్గ అభ్యర్థిగా జోసఫ్

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 17: బీఎస్పీ అద్దంకి నియోజకవర్గ అభ్యర్థిగా మందా జోసఫ్‌ను పార్టీ అధిష్ఠానం ప్రకటంది. ఈ సందర్భంగా జోసఫ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో అభ్యర్థిగా ప్రకటించిన పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర అధ్యక్షుడు బక్కపరం జ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని జోసఫ్ తెలిపారు.

20న మున్సిపల్ సమావేశం

అద్దంకి, ఫిబ్రవరి 17: అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షత వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

నేడు నాగులపాడు సొసైటీ పాలకమండలి ప్రమాణస్వీకారం

అద్దంకి, ఫిబ్రవరి 17: నాగులపాడు సొసైటీ అధ్యక్షుడిగా అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంకు చెందిన మానికొండ నాగరాజు, సభ్యులుగా తిమ్మాయపాలెం వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, వెంకటాపురంకు చెందిన భీమనాదం రాఘవరెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం ఉదయం కూకట్ల కన్వెన్షన్‌లో జరుగుతుందని చైర్మన్ మానికొండ నాగరాజు తెలిపారు.